క్లుప్తంగా

వైభవంగా పౌర్ణమి వేడుకలు



సంగం: స్థానిక తిరుమనకొండపై ఉన్న రాజరాజేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం ఉదయం పౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. తొలుత కాశీవిశ్వేశ్వరుడు, రాజరాజేశ్వరీదేవికి పవిత్ర పినాకిని నదీ జలాలతో అభిషేకాలు చేశారు. అనంతరం పూలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. పీఠాధిపతి రాజరాజేశ్వరానంద స్వామి పౌర్ణమి, చంద్రగ్రహణం విశిష్టతను భక్తులకు వివరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన



ఆత్మకూరురూరల్: వాశిలిలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి సర్పంచ్ చెలిక రమాహరిబాబు ఆధ్వర్యంలో ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి వాటర్ ట్యాంకు నిర్మాణం చేపడుతున్నట్లుగా తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుదర్శన్, పంచాయతీ కార్యదర్శి సంపూర్ణమ్మ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శిరీషా, వెల్ఫేర్‌అసిస్టెంట్ చంద్రశేఖర్, వీఏఏ నితీష్, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు కళాకారుడికి స్పెషల్ జ్యూరీ అవార్డు



అల్లూరు: విజయవాడలోని ప్రముఖ కళాసంస్థ శ్రీరామకృష్ణ నాట్య మండలి స్వర్ణోత్సవాల సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన నాటక పోటీల్లో అల్లూరుకు చెందిన కళాకారుడు ఆంజనేయరాజు స్పెషల్ జ్యూరీ అవార్డును దక్కించుకున్నారు. విజయవాడలోని శ్రీకేతా పూర్ణనంద కళా వేదికలో నిర్వహించిన పోటీల్లో 82 మంది కళాకారులు పాల్గొనగా, అందులో ఆంజనేయరాజు ప్రదర్శించిన పెద్దోడు ఏకపాత్రాభినయ పాత్రకు స్పెషల్ జ్యూరీ అవార్డు లభించింది. ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్, శ్రీరామకృష్ణ నాట్యమండలి సభ్యుల చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు ఆయన తెలిపారు.

చంపేస్తానని విలేకరికి బెదిరింపు

దగదర్తి: టీడీపీ నాయకుల అవినీతి అక్రమాలను ప్రశ్నిస్తూ వార్తలు రాస్తున్న 'ఆంధ్రప్రభ' పత్రిక విలేకరి సాధనాల మల్లికార్జున్‌ను చంపేస్తానని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు అనుచరుడు ఒంటిగుంట గోపాల్ బెదిరించాడు. మాలేపాటి వర్గీయుల అవినీతిని బట్టబయలు చేస్తుండడాన్ని ఓర్చుకోలేక ఒంటిగుంట గోపాల్ ఆదివారం ఆంధ్రప్రభ విలేకరి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను బెదిరించాడు. ఇకపై తమపై ఇటువంటి వార్తలు రాసినా, తమ అక్రమాలను ప్రశ్నించినా చంపేస్తామని హెచ్చరించాడు. దీంతో ఆంధ్రప్రభ విలేకరి దగదర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇటీవల ఇదేవిధంగా మండల వైఎస్సార్‌సీపీ నేత వివేక్‌రెడ్డి బంధువులను కూడా గోపాల్ బెదిరించ గా వారు భయభ్రాంతులకు గురై ఇంటి నుంచి బయటికి రావడం లేదని సమాచారం. తమ ఇంటిపైకి గోపాల్‌ను పంపించిన మాలేపాటి సుబ్బానాయుడు, చంపేస్తానని బెదిరించిన ఒంటిగుంట గోపాల్‌పైన పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు.

బాధితులకు న్యాయం చేయాలని వినతి



ఉదయగిరి: అప్పసముద్రంలో వినాయక చవితి నిమజ్జనోత్సవం సందర్భంగా జరిగిన బాణసంచా పేలుడు ఘటనలో గాయపడిన చిన్నారులకు న్యాయం చేయాలని జిల్లా యాదవ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు వింజమూరులో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ వ్యవహారం వెనుక ఉన్న వ్యక్తులు అధికార పార్టీకి చెందిన వారు అయినప్పటికీ మానవతా దృక్పథంతో అందులో ప్రమేయం ఉన్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. బాధిత కుటుంబాలు విషాదకర పరిస్థితుల్లో ఉన్నందున ప్రభుత్వం నుంచి చిన్నారులకు రూ.25 లక్షల వరకు పరిహారం అందించి న్యాయం చేయాలని కోరారు.

అన్నదాత కష్టం.. దళారుల భోజ్యం

- ఎడగారులో పెరిగిన పెట్టుబడులు.. తగ్గిన దిగుబడులు
- తెరుచుకోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు
- ఇదే అదనుగా తగ్గించి కొనుగోలు చేస్తున్న దళారులు
- మద్దతు ధర దక్కక నష్టపోతున్నామని అన్నదాతల ఆవేదన



వరి కోస్తున్న యంత్రం

సంగం: అన్నదాతలు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం దళారులకు భోజ్యంగా మారుతోంది. ఎడగారు పంట కోతలు మొదలైనా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను తెరవకపోవడంతో మిల్లర్లతో దళారులు కుమ్మక్కై ధరలను తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. దళారులపై చర్యలు తీసుకుని రైతులకు మద్దతు ధర అందించాల్సిన అధికారులు సైతం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో దళారులు అడిగి ధరకు ధాన్యాన్ని తెగనమ్ముకుంటూ నష్టపోతున్నామని అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు.

మిల్లర్లతో దళారులు కుమ్మక్కై

ఈ ఏడాది ఆత్మకూరు నియోజకవర్గంలోని రైతులు ఎడగారు కింద 32వేల ఎకరాల్లో ఎడగారు సాగుచేపట్టారు. అధికంగా 1638, 733, 1010, తదితర రకాలను సాగుచేశారు. ప్రస్తుతం రైతులు ఎడగారు పంట కోతలు చేపడుతున్నారు. ఎడగారు పంట కోతలు మొదలయ్యే సమయానికి కొనుగోలు కేంద్రాలను తెరిచి రైతులను ఆదుకోవాల్సిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇదే అదునుగా మిల్లర్లతో దళారులు కుమ్మక్కై ధరలను తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం పుట్టి రూ.16,700కు కొనుగోలు చేయాల్సి ఉండగా, దళారులు రూ.14,500కు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను తెరవకపోవడం ..ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు గోదాములు లేకపోవడంతో అన్నదాతలు దళారులు అడిగిన ధరకు తెగనమ్ముకుంటూ తీవ్రంగా నష్టపోతున్నారు.

పట్టించుకోని ప్రభుత్వం

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. సంగం మండలంలో 8,500 ఎకరాల్లో ఎడగారు సాగుచేయగా, ఇప్పటికే 1500 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను తెరుస్తుందేమోనన్న ఆశతో రైతులు ధాన్యాన్ని ముంబయి జాతీయ రహదారి పక్కన ఆరబోసుకుని ఎదురుచూశారు. ఆ దిశగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో రేయింబవళ్లు కాపలా ఉండలేక దళారులు అడిగిన ధరకు తెగనమ్ముకుంటున్నారు.

పెరిగిన పెట్టుబడులతో నష్టం

ఈ ఏడాది కూటమి ప్రభుత్వ అలక్ష్యం వల్ల ఎడగారు సాగుకు పెట్టుబడి వ్యయం కూడా బాగా పెరిగిపోయింది. యూరియా కొరత వల్ల అన్నదాతలు బ్లాక్‌లో అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేసివేశారు. దీని వల్ల ఎకరాకు రైతుకు రూ.1500 నుంచి రూ.2వేల వరకు పెట్టుబడులు పెరిగాయి. యూరియాకు పురుగుమందులు, కాంప్లెక్స్ ఎరువులను డీలర్లు లింక్ పెట్టడంతో వాటిని సైతం కొనుగోలు చేయాల్సి రావడంతో రైతులపై భారంపడింది. దీంతో ఎడగారులో ఎకరాకు రూ.40వేల వరకు పెట్టుబడులు అయ్యాయని రైతులు చెబుతున్నారు. ఎడగారులో ఎకరాకు మూడు పుట్లు మాత్రమే దిగుబడులు వస్తున్నాయి. దీంతో పెట్టుబడి వ్యయం పోగా ఎకరాకు రూ.3,500 మిగలడంతో అన్నదాతలు శ్రమకష్టం కూడా దక్కలేదని ఆవేదన చెందుతున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కౌలు కూడా అప్పు చేసి కట్టే పరిస్థితి నెలకొందని అన్నదాతలు వాపోతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పుట్టి ధాన్యం రూ.20వేలకుపైగా పలకవడంతో ఆదాయం వచ్చి సంతోషంగా ఉన్నామని అన్నదాతలు గుర్తు చేసుకుంటున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నెల్లూరు-ముంబయి రహదారిపై ఆరబోసి ఉన్న ధాన్యం

ఆత్మకూరు నియోజకవర్గంలో ఎడగారు సాగు

మండలం	ఎకరాల్లో
ఆత్మకూరు	10,750
సంగం	8,500
అనంతసాగరం	6,200
చేజర్ల	3,400
ఏఎస్‌పేట	1,750
మర్రిపాడు	1,500

జిల్లా అధికారులు ఆదేశిస్తే ఏర్పాటు చేస్తాం

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయాన్ని జిల్లా అధికారులకు నివేదించాం. వారి నుంచి ఆదేశాలు రాగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం.

–శశిధర్, ఏఓ, సంగం



దళారులకు ధాన్యాన్ని విక్రయిస్తున్న రైతులు

అన్నదాత పోరు జయప్రదానికి పిలుపు

సోమశిల: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నదాతల సమస్యల పరిష్కారానికి ఆత్మకూరులోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాత పోరు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లుగా వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బిజివేముల పిచ్చిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన అనంతసాగరంలో విలేకరులతో మాట్లాడారు. అన్నదాతలు యూరియా కొరతతో అల్లాడుతుండగా, వ్యాపారులు మాత్రం యథేచ్ఛగా బ్లాక్ మార్కెట్‌కు తరలించి అధిక ధరలకి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో రైతులు క్యూలైన్లలో పడిగాపులు కాయాల్సి వస్తోందన్నారు. ఈ పరిస్థితులకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ఆర్డీఓ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారని తెలిపారు. ఈ మేరకు ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట చేపడుతున్న నిరసన కార్యక్రమంలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు పొంగళ్లు

జలదంకి : జలదంకి పంచాయతీ పరిధిలోని గమళ్లపాళెంలో పోలేరమ్మకు సామూహిక పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పోలేరమ్మ ఆలయాన్ని పూలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు పొంగళ్ల సామగ్రితో ఊరేగింపుగా పోలేరమ్మ ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు.

అన్నదాతలకు శాపంగా కూటమి ప్రభుత్వం



అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కావలి (జలదంకి): రాష్ట్రంలోని అన్నదాతల పాలిట కూటమి ప్రభుత్వం శాపంగా మారిందని కావలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. కావలిలోని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అన్నదాత పోరు పోస్టర్లను ఆదివారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు సాగుచేసిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఖరీఫ్ పంటలు సాగుచేస్తున్న రైతులకు యూరియాను అందించకపోవడంతో వారు క్యూలైన్లు కట్టి నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిందని గుర్తుచేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైతులకు పంటల బీమా, నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి ప్రోత్సాహకాలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. పంటలకు అవసరమైన యూరియాను సరఫరా చేయడంలో కూడా వైఫల్యం చెందిందన్నారు. రైతులకు సొసైటీల్లో యూరియా దొరకకున్నా బ్లాక్ మార్కెట్‌లో మాత్రం అధిక రేట్లకు ఎరువుల వ్యాపారులు విక్రయిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలోని రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. రైతుల పాలిట శాపంగా మారిన కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 9న అన్నదాత పోరును తలపెట్టినట్లుగా తెలిపారు. కావలిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ట్రంకు రోడ్డులోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి నివాళులర్పించనున్నట్లు చెప్పారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని ఆర్డీఓకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. అన్నదాతలకు న్యాయం చేసేందుకు కూటమి ప్రభుత్వం మెడలు వంచేందుకు చేపడుతున్న అన్నదాత పోరులో రైతులు, రైతు సంఘాల నాయకులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ పట్టణాధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పందింటి కామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు కనమర్లపూడి వెంకటనారాయణ, బోగోలు, కావలి రూరల్ మండలాధ్యక్షులు మద్దిబోయిన వీరరఘు, వాయిల తిరుపతి, నాయకులు నీలం సాయి కుమార్, దండా కృష్ణారెడ్డి, సన్నిబోయిన ప్రసాద్, జంపాని రాఘవులు, కుందుర్తి కామయ్య, కనపర్తి రాజా, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, చెన్నుపాటి ప్రసాద్ రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎడగారు రైతులను ఆదుకోవాలి

జలదంకి: ధాన్యానికి మద్దతు ధరను కల్పించి ఎడగారు సాగుచేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం మండలాధ్యక్షుడు రావి మాల్యాద్రి కోరారు. స్థానిక సురెచెంచురెడ్డి భవనంలో మండల ఏపీ రైతు సంఘం రెండో మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మూలి వెంగయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం పుట్టి ధాన్యానికి రూ.20,360 మద్దతు ధరను ప్రకటించినా క్షేత్రస్థాయిలో దళారులు తగ్గించి కొనుగోలు చేస్తున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా పుట్టి రూ.15 వేలకే కొనుగోలు చేస్తుండడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను తెరిచి మద్దతు ధరను అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతు సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గడ్డం మాల్యాద్రి, గోపసాని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల అభివృద్ధికి సహకారం

సీతారామపురం: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల అభివృద్ధికి సహకారాన్ని అందిస్తామని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. మారంరెడ్డిపల్లి పీఏసీఎస్ నూతన చైర్మన్‌గా సామనబోయిన రాజశేఖర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాకర్ల ముఖ్యఅతిథిగా హాజరై అభినందించారు. అనంతరం ఎమ్మెల్యేను రాజశేఖర్ ఘనంగా సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల దాతృత్వం



ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన కంచె

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం కాటేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో మూగజీవాలు లోనికి ప్రవేశించి అపరిశుభ్రం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మూగజీవాల సమస్య పరిష్కారానికి హెచ్‌ఎం వెంకటేశ్వర్లు చొరవతో పాఠశాల ఉపాధ్యాయులు కంచె ఏర్పాటుకు ముందుకొచ్చారు. తమ సొంత నిధులు రూ.25వేలు వెచ్చించి కంచె ఏర్పాటు చేశారు. దీంతో ఉపాధ్యాయులకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

ఆశీర్వచనం



ఉదయగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపల్లిలో ఆదివారం జరిగిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బండి ప్రసాద్ కుమారుడు రాజమోహన్ వివాహానికి ఉదయగిరి నియోజవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట స్థానిక నాయకులు అర్లపడియ తిరుపతిరెడ్డి, తిరుపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న మాల్యాద్రి

కావలి (జలదంకి): ఉపాధి హామీ పథకం కూలీలకు వేతనాలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తాళ్లూరి మాల్యాద్రి డిమాండ్ చేశారు. పట్టణంలోని శివరామసుబ్బయ్య భవనంలో కావలి మండల వ్యవసాయ కార్మిక సంఘ ఆరో మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 14 వారాలుగా వేతనాలు అందజేయకపోవడంతో వారు పనులకు రావడానికి ఇష్టపడడం లేదన్నారు. ఉపాధి కూలీలకు దినసరి వేతనం రూ.307 అందడం లేదని, కేవలం రూ.150 మాత్రమే అందజేస్తున్నారని తెలిపారు. గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ ఎక్కువగా మాట్లాడడమే తప్ప, ఆచరణలో ఏమి చేయడం లేదన్నారు. ఉపాధి కూలీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా పీ సీతారామయ్య, కార్యదర్శిగా రాధాకృష్ణయ్యతో పాటు మరో ఏడుగురు సభ్యులను ఎన్నుకున్నారు.

రోడ్డు దిగితే అంతే!



వరికుంటపాడు మండలంలోని తిమ్మారెడ్డిపల్లి–చాకలికొండ ఆర్‌అండ్‌బీ రోడ్డు ఇరువైపులా మార్జిన్లు లేక ప్రమాదభరితంగా ఉంది. తిమ్మారెడ్డిపల్లి–చాకలికొండ సింగిల్ రోడ్డు నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఇటీవల కొత్తగా తారు వేయడంతో వాహనచోదకులు వేగంగా వెళ్తున్నారు. తిమ్మారెడ్డిపల్లి సబ్‌స్టేషన్ సమీపంలో ఇరువైపులా మార్జిన్లు లేకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలకు సైడిచ్చే క్రమంలో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో మార్జిన్లు కనిపించకపోవడంతో వాహనచోదకులు ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళనలు చెందుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు మార్జిన్లు నిర్మించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

– వరికుంటపాడు

ధాన్యానికి మద్దతు ధర కల్పించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

అల్లూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు కనీస మద్దతు ధరను అందించి ఆదుకోవాలని సీపీఎం నాయకుడు షేక్ రషీద్ డిమాండ్ చేశారు. అల్లూరులోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రబీ సీజన్‌లో పుట్టి ధాన్యానికి ఏ గ్రేడ్ రకానికి రూ.19,700, సాధారణ రకానికి రూ.19,550 మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన క్షేత్ర స్థాయిలో అమలుకు నోచుకోలేదన్నారు. ప్రస్తుతం ఖరీఫ్‌లో పుట్టి ధాన్యానికి ఏ గ్రేడ్‌కు రూ.20,306, సాధారణ రకానికి రూ 20,130 మద్దతు ధరను ప్రకటించినా దళారులు తగ్గించి కొనుగోలు చేస్తున్నారని, రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులుకు మద్దతు ధరను అందించి ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం నుంచి కనీస మద్దతు ధరను సాధించేందుకు ఈ నెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు నెల్లూరులోని గాంధీబొమ్మ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు రైతులతో ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. సీపీఎం నాయకులు గోపసాని రమేష్, పాటి భాస్కర్, నేతగాని రమణయ్య, కంచుపాటి విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న కొండమూరు హజరత్తయ్య

సోమశిల: కార్మికులు ఐక్యంగా ఉండి పోరాటం సాగించడం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కొండమూరి హజరత్తయ్య అన్నారు. అనంతసాగరం మండల సీఐటీయూ మూడో మహాసభను ఆదివారం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఐటీయూ కార్మికుల ఐక్యత, హక్కుల సాధనకు నిరంతరం పనిచేస్తుందన్నారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలను తుంగలో తొక్కి నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేసిందన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ, ఆశావర్కర్లకు, వెలుగు వీఓఏలకు, వీఆర్‌ఏలకు, భవన నిర్మాణ, ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కూటమి ప్రభుత్వం ప్రైవేట్ పరం చేసేందుకు కుట్రలు పన్నుతుందన్నారు. ప్రభుత్వం రంగ సంస్థలను కాపాడుకోవడానికి సీఐటీయూ పోరాటం చేస్తుందన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్ష, కార్యదర్శులుగా మీరామొహిద్దీన్, ఉప్పలపాడు మస్తాన్, కోశాధికారిగా నాగమణిను ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ సభ్యులు అన్వర్‌బాషా, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

అపూర్వం.. 50 ఏళ్ల ఆత్మీయం



ఉపాధ్యాయుడ్ని సత్కరిస్తున్న పూర్వవిద్యార్థులు

కావలి (జలదంకి): వారంతా పదోతరగతి కలిసి మెలిసి చదువుకున్నారు. ఆ తరువాత విడిపోయారు. ఉన్నత విద్యను అభ్యసించి దేశవిదేశాల్లో స్థిరపడ్డారు. 50ఏళ్ల తరువాత ఒకరునొకరు కలుసుకున్నారు. గత స్మృతులను నెమరువేసుకున్నారు. ఆటపాటలతో సందడిగా గడిపారు. ఇందుకు కావలిలోని విశ్వోదయ పాఠశాల వేదికై ంది. విశ్వోదయలో పూర్వవిద్యార్థి సీహెచ్ అజయ్‌కుమార్ అధ్యక్షతన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. దేశవిదేశాల్లో స్థిరపడిన 1975–76 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థులు హాజరై తమ స్నేహితులతో ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమానికి అన్నదాత మణి ముఖ్యఅతిథిగా హాజరై తన ప్రాశలతో విద్యార్థులను ఆకట్టుకున్నారు. విశ్వోదయ పాఠశాల హెచ్‌ఎం ద్వారకానంద చౌదరి పాఠశాల అభివృద్ధి గురించి వివరించారు. అనంతరం విశ్వోదయ ఉపాధ్యాయులు మధుసూదన్‌రావు, సుధాకర్‌ను పూర్వవిద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి వై నారాయణరెడ్డి పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. అలాగే మరి కొంత మంది విద్యార్థులు విరాళాలను ప్రకటించారు. పూర్వ విద్యార్థులు ఎంవీ రామారావు, టంగుటూరి ప్రకాష్, సమాధి విష్ణుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రగ్రహణంతో ఆలయాల మూత





మూతపడిన వెంగమాంబ, సంగమేశ్వరాలయాలు

దుత్తలూరు/సంగం: చంద్రగ్రహణం సందర్భంగా నర్రవాడలోని వెంగమాంబ పేరంటాలు దేవస్థానాన్ని ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూసివేశారు. ఆలయ శుద్ధి, సంప్రోక్షణ అనంతరం సోమవారం ఉదయం 8 గంటలను ఆలయాన్ని తెరిచి భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు అర్చకులు తెలిపారు. కాగా సంగం మండలంలోని తిరుమనకొండ రాజరాజేశ్వరీదేవి, సంగంలోని సంగమేశ్వరుడు, వంగల్లులోని భీమేశ్వరుడు, దువ్వూరులోని త్రికోటేశ్వరుడు, అన్నారెడ్డిపాళెంలోని ఆత్మారామస్వామి ఆలయాలను మూసివేశారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పిస్తామని అర్చకులు తెలిపారు.